అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్
- ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 23: ప్రజా వాణిలో వచ్చే అర్జీలను పరిశీలించి, త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు శాఖల వారీగా స్వీకరించిన అర్జీలపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, ప్రజావాణి కార్యక్రమానికి 56 అర్జీలు వచ్చాయని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించాలి

ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు వచ్చి తమ పంట పొలాలు, మామిడి తోటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు వ్యవసాయి, రెవెన్యూ అధికారులు ఎవరూ రాలేదు. సుమారు 60 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. తమకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించి, ఆదుకోవాలని రైతులు పిడుగు ఆనందరెడ్డి, తునికి నర్సయ్య, ఎండీ రజాక్, జెట్టి గంగనర్సయ్య, గుండెటి నారాయణ, జక్కుల రాజమల్లయ్య కలెక్టర్‌కు అర్జీ అందించి, కోరారు. **-బొమ్మెన గ్రామస్తులు. కథలాపూర్ మండలం**

నా ఆస్తి తిరిగి ఇప్పించాలి

తన ఆస్తి తనకు తిరిగి ఇప్పించాలని ఆయోధ్య గ్రామానికి చెందిన ఎడ్ల నర్సమ్మ కలెక్టర్‌కు అర్జీ అందించారు. కొడుకులు, కొడళ్లు తన ఆస్తిని ఆక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని, తనను ఇంట్లో నుంచి గెంటిసినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆస్తి తిరిగి తనకు సంక్రమించేలా చూడాలని కలెక్టర్‌ను కోరింది. **-ఎడ్ల నర్సమ్మ, ఆయోధ్య, రాయికల్ మండలం**

కూతుళ్లు తిండి పెడతలేరు

నాకు ఇద్దరు కూతుళ్లు. భర్త పోచయ్య ఇటీవల మృతి చెందాడు. తనకు ఉన్న ఆస్తిని ఇద్దరు బిడ్డలకు రాసి ఇచ్చినా. అయినా బిడ్డలు తిండి పెట్టడం లేదు. బంధువుల ఇంట్లో ఉంటున్నా. అయ్యా నా ఆస్తిని నాకు ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నది. **-దుంపాటి రామవ్వ, తేలుకుంట, గొల్లపల్లి మండలం**

బస్సు సదుపాయం లేక విద్యార్థుల ఇక్కట్లు

బస్సు పూర్తిగా నిండిపోవడంతో ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

కథలాపూర్, సెప్టెంబర్ 23: మండలంలోని ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలకు రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సాయంత్రం మోడల్ స్కూల్ స్టాఫ్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపలేదు. దీంతో గంభీర్‌పూర్ బస్టాప్ వద్దకు వెళ్లి బస్సు ఎక్కారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పాఠశాల వేళల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జగిత్యాల అర్బన్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

పోషకాహారంతోనే ఆరోగ్యం

సారంగాపూర్, సెప్టెంబర్ 23: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని తహసీల్దార్ వరందన్ పేర్కొన్నారు. మండలంలోని నాయకపు గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరందన్ మాట్లాడుతూ, అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ గంగాధర్, ఎంపీవో శశికుమార్, ఏపీఎం రాజయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లత, శైలజ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 23: పట్టణంలోని 12వ వార్డులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి హాజరై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కౌన్సిలర్ నక్క జీవన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్యాల/మేడిపల్లి, సెప్టెంబర్ 23: మల్యాల మండల కేంద్రానికి చెందిన వంగల మహిత ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. మహిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, వెల్మ కృష్ణారెడ్డి, మ్యాక లక్ష్మణ్, శనిగరపు తిరుపతి, ఆగంతం వంశీధర్, ప్రశాంత్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, అల్లూరి రాజు రెడ్డి, మురళి తదితరులున్నారు. మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన పరిపెల్లి రాణదీప్‌రెడ్డి, ఏలేటి గంగారెడ్డి, జంబుక చిన్నమ్మ, కాచారం గ్రామానికి చెందిన చిట్యాల గంగు, కొప్పెర రాంరెడ్డి, ఒడ్డవేని రాజములు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, నాయకులు దొనకంటి రాజగోపాల్‌రావు, గడ్డం నారాయణరెడ్డి, మాలోతు లచ్చనాయక్, వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్, నాగరాజు, నర్సారెడ్డి తదితరులున్నారు.

మల్యాల: మహిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తా: అనంతరెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 23: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంత రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీఆర్ హైస్కూల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కేంద్రంలో మానేర్ హైస్కూల్‌ను 1986లో స్థాపించినట్లు తెలిపారు. విద్యారంగంలో, 2003 ట్రస్మా ఏర్పాటు చేసిన తర్వాత పాఠశాలల బలోపేతానికి, పాఠశాలలకు విధించే పన్నులు, తదితర సమస్యలపై పోరాటం చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులకు సంబంధించి 370 రూల్, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సమావేశంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు క్యాతం గంగారెడ్డి, కైలాసం, గంగారెడ్డి, ట్రస్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

ట్రస్మా రాష్ట్ర కార్యవర్గాన్ని ఇటీవల హైదరాబాద్‌లో ఎన్నుకున్నట్లు అనంతరెడ్డి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, కోశాధికారిగా శ్రీకాంత్ రెడ్డిని ఎన్నుకున్నామని, మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే నియమిస్తామని పేర్కొన్నారు.

జగిత్యాల నుంచి కొండగట్టుకు పాదయాత్ర

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన వారిని శిక్షించాలని కోరుతూ జిల్లా కేంద్రానికి చెందిన భక్తులు జగిత్యాల నుంచి కొండగట్టు వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి, మానాల నటరాజ్, సతీశ్, అడ్డగట్ట పరందం, సాయి, మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్ దేశాయి, ఏసీఎస్ రాజు, కిషన్, సుధాకర్, ఠాకూర్ కిశోర్‌సింగ్, బడే శంకర్, మాడిశెట్టి మల్లేశం, లక్ష్మారెడ్డి, బండారి మల్లికార్జున్, ఎర్ర శ్రీను, వేముల సంతోష్, జిట్టవేని అరుణ్‌కుమార్, సంతోష్, గణేశ్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఎనిమిది రోజుల జైలు

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 23: తాగి వాహనం నడిపిన వ్యక్తికి జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గంప కరుణాకర్ ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఎస్ఐ రాంచంద్రం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలలో ఇటీవల వాహనాల తనిఖీలు చేపట్టగా, కరీంనగర్‌కు చెందిన కొరవేని పెద్దిరాజు తాగి వాహనం నడుపుతూ దొరికినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా, న్యాయమూర్తి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కథలాపూర్, సెప్టెంబర్ 23: ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 200 మందితో సభ్యత్వం చేయించడమే లక్ష్యంగా బీజేపీ నాయకులు పనిచేయాలని పార్టీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. భూషణరావుపేట గ్రామంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు పూండ్ర ప్రతాప్‌రెడ్డి, తుమ్మనపెల్లి మహేశ్, ప్రవీణ్, సాయాగౌడ్, ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 23: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన బొమ్మ రవి(46) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మ రవి భవన నిర్మాణ కూలీగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈనెల 18న ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వెళ్లి, పని ముగించుకొని సాయంత్రం ఇంటికి తిరిగివస్తున్నాడు. మెట్లచిట్టాపూర్ శివారులో కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కాగా, నిజామాబాద్‌లోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స అందించినా ఫలితం ఉండదని వైద్యులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం రవిని ఇంటికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పోలీస్ ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ డే

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 23: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది వివిధ సమస్యలపై ఎస్పీకి అర్జీలు అందజేశారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

దుబ్బ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

సారంగాపూర్, సెప్టెంబర్ 23: పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో నాలుగు గొర్రెలు మృతి

రాయికల్, సెప్టెంబర్ 23: రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో ఎట్టం మల్లేశ్‌కు చెందిన 4 గొర్రెలు విద్యుత్ షాక్ వచ్చి మృతి చెందాయి. గొర్రెల విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 23: మెగాస్టార్ చిరంజీవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా స్థానిక శివనగర్‌లోని శివ గాయత్రి అనాథ వృద్ధుల ఆశ్రమంలో జగిత్యాల చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రజా సేవా సమితి ఫౌండర్, అధ్యక్షుడు ఎండీ పాషా, సభ్యులు నాగుల శ్యామ్ గౌడ్, పులి నాగరాజు గౌడ్, వొడ్నాల రాజేష్, కస్తూరి వెంకటరమణ, పెండెం గంగాధర్, ఆశ్రమం చైర్మన్ గిరి నాగభూషణం, బాపురెడ్డి, చంద్రమౌళి, రోహిణి పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, సెప్టెంబర్ 23: ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఎంఈవో శ్రీనివాస్, ఏఈ శంషేర్‌అలీ, డీటీ రాజశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్, ఏపీఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 23: పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఇట్యాల కిషన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏవో నాగమణి, ఏఈవో గంగుల నరేశం, ఏపీవో శంకర్, ఏపీఎం మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 23: మండలంలోని ఐలాపూర్ గ్రామంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి దవాఖాన వైద్యులు సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు కంటి పరీక్షలు చేసి, అవసరమున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నగునూరి గంగాధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దీకొండ రాజ నర్సయ్యగౌడ్, కోశాధికారి అశోక్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు నవీన్, కట్కం గణేశ్, నాగ చంద్రప్రకాశ్, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లా స్థాయి ఫుట్ బాల్ పోటీలు

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 23: జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో ఈ నెల 26న జిల్లాస్థాయి ఫుట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 26న ఉదయం 9 గంటలకు ఎలిజిబిలిటీ ఫారాలతో రిపోర్ట్ చేయాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరామ్ నాయక్ చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

గొల్లపల్లి, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పీజీటీ ఫిజిక్స్-1, పీజీటీ తెలుగు-1, టీజీటీ హిందీ-1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ సుంకరి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 26న పాఠశాలలో ఇంటర్వ్యూ, డెమో ఉంటుందని పేర్కొన్నారు.

కోరుట్ల, సెప్టెంబర్ 23: పట్టణంలోని అల్లమయ్య గుట్ట సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల అగ్రికల్చర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 10 గంటలకు కోరుట్లలోని కళాశాలలో స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 83740 00563, 86393 65500లో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

జగిత్యాల రూరల్: స్వచ్ఛతపై ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 23: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్ సూచించారు. లక్ష్మీపూర్ గ్రామం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవా అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, రీజినల్ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఐ దివ్యావాణి, ప్రత్యేకాధికారి రవిబాబు, ఏపీఎం గంగాధర్, ఎఫ్ఎల్సీ మధుసూదన్, ఉపాధ్యాయురాలు సరోజిని, కార్యదర్శి రాజేశ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్లు సత్తవ్వ, లావణ్య, వీవోఏలు రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, సునీత, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్, సెప్టెంబర్ 23: పట్టణంలోని ప్రగతి పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఎస్ హెచ్ ఎస్ 24 ఆకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కర స్పాండెంట్ బాలె జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి

సారంగాపూర్, సెప్టెంబర్ 23: మండలంలోని రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, అర్పల్లి, బట్టపల్లి, పోతారం గ్రామాల్లో ఎస్ఆర్ఎస్పీ కాలువల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి సాగునీరు చివరి వరకు అందడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆటో యూనియన్ సభ్యుల శ్రమదానం

కోరుట్ల, సెప్టెంబర్ 23: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజా టాయ్‌లెట్స్ పరిసరాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆటో యూనియన్ సభ్యులు సోమవారం శ్రమదానం చేశారు. ప్రజా టాయ్‌లెట్స్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. పబ్లిక్ టాయ్‌లెట్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఏఈ గోనెల మహేశ్, ఆటో యూనియన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఖాతా నంబరు కేటాయించాలని వినతి

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 23: 2002లో డీఎస్సీ రాసి 2008, 2009లో విధుల్లో చేరిన హిందీ పండిత్‌లకు జీపీఎఫ్ ఖాతా నంబరు కేటాయించాలని జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినపెల్లి ఆనంద్‌రావు, యాళ్ల అమర్నాథ్‌రెడ్డి సోమవారం వినతి పత్రం అందించారు. ఉత్తర్వులను పరిశీలించి జీపీఎఫ్ ఖాతా నంబర్ కేటాయిస్తామని సీఈవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొంగోని మల్లేశ్‌గౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

పద్మశాలీ యువత కార్యవర్గానికి సత్కారం

కోరుట్ల, సెప్టెంబర్ 23: పట్టణంలో విశ్వ వయో వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణ పద్మశాలీ సంఘం యువత నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో విశ్వ వయో వృద్ధుల సంఘం ప్రతినిధులు గంగాధర్, శంకర్, లక్ష్మీపతి, సాంబయ్య, నాయకులు ప్రసాద్, అశోక్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రయోగిల్లు' ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 23: వెల్లుల్ల గ్రామంలో మరిపెల్లి ప్రవీణ్ స్థాపించిన 'ప్రయోగిల్లు' తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కాగా, విజేతలకు వచ్చే నెల 2న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు అభినందన

మేడిపల్లి, సెప్టెంబర్ 23: భీమారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పెసరి తిరుమలేశ్‌ను మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏఎంసీ చైర్‌పర్సన్ డిండిగాల లావణ్య, ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీధర్, నజీమా, సాహేబా, అఫ్సర్, నరేందర్, జయశ్రీ, రమేశ్, నీలిమ, సంధ్యారాణి, నాయకులు రఘు, రాజు, నర్సయ్య అభినందించారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన

జగిత్యాల/జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 23: జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఐటీఎంబీ స్కూల్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీఎంబీ స్కూల్ మేనేజర్ డాక్టర్ కృష్ణమోహనరావు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ మార్కెటింగ్ ఆవశ్యకతను వివరించారు. ఆర్‌కే, ఎన్ఎస్‌వీ విద్యా సంస్థల చైర్మన్ యాద రామకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ నరేశ్, ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి, మల్లికార్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కళ్లపెల్లిలో పురావస్తు శాఖ అధికారుల పర్యటన

కథలాపూర్, సెప్టెంబర్ 23: తక్కళ్లపెల్లి గ్రామంలో సోమవారం పురావస్తుశాఖ అధికారి రవితేజ, సిబ్బంది పర్యటించారు. గ్రామశివారులోని బోగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా, బోగేశ్వరస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో పురావస్తుశాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కథలాపూర్, సెప్టెంబర్ 23: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు కథలాపూర్ మండలానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ సోమవారం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం సభ్యులు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి

మారుతీనగర్, సెప్టె